థైలేరియా నుంచి పాడి ఆవులకు రక్షణ

- వ్యాధి నివారణపై పాడిరైతులకు విస్తృత అవగాహన
- ఈ నెల 31 వరకూ థైలేరియా టీకాల కార్యక్రమం
- కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో 7700 ఆవులకు టీకాలు లక్ష్యం



థైలేరియా వ్యాధి బారిన పడకుండా పశువులను కాపాడుకోవాలని వివరిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : సంకర జాతి పశువులు థైలేరియా వ్యాధి బారిన పడకుండా పశుసంవర్ధకశాఖ ద్వారా ఉచితంగా టీకాల కార్యక్రమం చేపడుతోంది. ముఖ్యంగా సంకర జాతి ఆవులు ఈ థైలేరియా వ్యాధి బారిన పడుతున్నాయి. 3 నెలలు దాటిన సంకర జాతి ఆవులు ఈ వ్యాధితో ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి. ఈ వ్యాధికి గురైన సంకర జాతి ఆవుల్లో అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం, పశువు మేతను తీసుకోవడం తగ్గించడం, నీరసించిపోవడం, పాల దిగుబడి తగ్గడంతో పాటు క్రమంగా మరణాలు సంభవించే పరిస్థితులు ఉంటాయి. తద్వారా పాడి రైతు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంటుంది. దీనిని నివారించడానికి పాడి రైతుల్లో అవగాహన కల్పిస్తూ టీకాల కార్యక్రమం చేపట్టారు.

31 వరకూ వ్యాక్సినేషన్ కార్యక్రమం

పశుసంవర్ధకశాఖ ద్వారా థైలేరియా వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నారు. కె.కోటపాడు,



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

దేవరాపల్లి మండలాల పరిధిలో గల సంకర జాతి ఆవులకు థైలేరియా వ్యాక్సినేషన కార్యక్రమం ఈ నెల 13 నుంచి ప్రారంభించారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో 7700 సంకర జాతి పశువులకు వ్యాక్సిన్‌ను వేయడాన్ని పశుసంవర్ధకశాఖ సిబ్బంది లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతానికి 4200 సంకర జాతి ఆవులకు థైలేరియా వ్యాక్సిన్ వేయగా మిగిలిన 3500 ఆవులకు ఈ నెలాఖరులోగా టీకాలను



థైలేరియా వ్యాక్సిన్

వేసి శతశాతం లక్ష్యాన్ని పూర్తి చేయనున్నట్టు పశు సంవర్ధకశాఖ సిబ్బంది తెలిపారు.

రైతులు అవగాహన కలిగి ఉండాలి



పాడి రైతులు సంకర జాతి ఆవుల్లో ప్రస్తుత సమయంలో థైలేరియా వ్యాధి సోకే పరిస్థితులు ఉన్నాయి. ఈ వ్యాధి బారిన పడిన ఆవుల్లో కనిపించే లక్షణాలపై రైతులకు ప్రత్యేక సమావేశాల ద్వారా వివరిస్తున్నాం. ఈ నెల 13 నుండి థైలేరియా వ్యాక్సిన్‌ను ఆవులకు వేస్తున్నాం. రైతులు తప్పకుండా థైలేరియా వ్యాక్సిన్‌ను ఆవులకు వేయించి వ్యాధిబారిన పడకుండా కాపాడుకోవాలి.

– సిహెచ్.వై.నాయుడు, పశువైద్యాధికారి, చౌడువాడ

ఎంపీటీసీ భీశెట్టి మృతికి సంతాపం



భీశెట్టి శ్రీనివాసరావు (ఫైల్)

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం ఎంపీటీసీ–2 సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్రీనివాసరావు విశాఖలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, శుక్రవారం రాత్రి ఆయనను కె.జె.పురంలో స్వగృహానికి తీసుకొచ్చారు. కె.జె.పురం గ్రామంలో ఆయన ఇంటి వద్ద మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. 2021 సెప్టెంబరులో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో ఆయన టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. గతంలో కె.జె.పురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం పార్టీలో పలు పదవులు చేపట్టారు. ఆయన భౌతికకాయం వద్ద శనివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే, యలమంచిలి



భీశెట్టి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారు, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఎంపీపీ రాజారామ్

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, స్థానిక ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతో పార్టీ నాయకులు అద్దిపల్లి జగ్గారావు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఉద్యోగులు నివాళులు అర్పించారు. శ్రీనివాసరావు అంతిమ యాత్రలో ధర్మశ్రీ, నాయకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఇళ్లకు అమర్చకుండా అడ్డుకోవాలి

ఆర్.వై.అగ్రహారంలో సీపీఎం పిలుపు

కె.కోటపాడు : అదానీ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు ఏర్పాటు చేయకుండా ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఎం నాయకుడు ఈర్లె నాయుడుబాబు తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు వ్యతిరేకంగా శనివారం ఆర్.వై.అగ్రహారంలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయుడుబాబు మాట్లాడుతూ పాత మీటర్లను కొనసాగించాలని ఆయన కోరారు. కరెంట్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏడాది పాలనలోనే రూ.15,485 కోట్లు భారం ప్రజలపై ఛార్జీల రూపంలో మోపిందని అన్నారు. బడా బాబుల జేబులు నింపేందుకు



ఆర్.వై.అగ్రహారంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలను అందిస్తున్న సీపీఎం నాయకులు

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఛార్జీలను పెంచుతున్నట్టు తెలిపారు. ప్రజలకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యాళ్ల శ్రీను, యడ్ల రామారావు, మల్లునాయుడు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణించేదెలా...?

నాతవరం : మండలంలో వెదురుపల్లి గ్రామం మధ్యలో అర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో ఇటీవల రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించి రోడ్డు పనులు చేయడం మానేశారు. గ్రామం మధ్యలో కావడంతో డ్రైనేజీలు ఎత్తులో రోడ్డు పల్లంగా ఉండడంతో రోడ్డుపై ఉన్న నీరు బయటకు ప్రవహించే మార్గం లేదు. ఏమాత్రం వర్షం పడినా నీరంతా రోడ్డుపైనే నిల్వ ఉంటుంది. వచ్చేపోయే వాహనాలతో రోడ్డు మధ్యలో పెద్ద గోతులు పడి అధ్వానంగా మారింది. అర్అండ్‌బీ అధికారులు కనీసం గోతులు కప్పివేస్తే గ్రామం మధ్యలో ఈ సమస్య ఉండేది కాదని గ్రామస్తులు అంటున్నారు. డ్రైనేజీలు నిర్మించినా ఎలాంటి ఉపయోగం లేదని చెబుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయంగా ఉండడంతో రోగాలు వ్యాపిస్తాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వెదురుపల్లి గ్రామం మధ్యలో అర్అంబీజీ రోడ్డు

రామకృష్ణ, అప్పలనర్స మృతి పార్టీకి తీరని లోటు





ఎంపీటీసీ, సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అమర్‌నాథ్, ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : మంగళాపురం ఎంపీటీసీ పత్తి అప్పలనర్స, మాజీ సర్పంచ్ కంటే రామకృష్ణ మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీలు తెలిపారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరూ రెండు రోజుల వ్యవధిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అమర్, ధర్మశ్రీ ఇద్దరు కలిసి ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను శనివారం వీరు పరామర్శించారు. మాజీ సర్పంచ్ కంటే రామకృష్ణ భార్య మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బయమ్మను ఆమె కోడలు ప్రస్తుత సర్పంచ్ కంటే వెంకట్ పద్మరేఖను, ఎంపీటీసీ సభ్యురాలు అప్పలనరస భర్త కృష్ణను వీరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇద్దరి మృతికి గల కారణాలను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇరువురు కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని అమర్, ధర్మశ్రీ తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ చైర్మెన్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, పార్టీ జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, స్కూల్ కమిటీ మాజీ చైర్మెన్ పాతాళ సత్తిబాబు, మాజీ కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద నాయకులు ఆనంద్, ప్రసాద్, క్రిష్ణ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మాడుగుల రూరల్ : మాడుగుల పాలసొసైటీ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రాపేట రామకొండలరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ సమీపంలో గల అనిల్ నీరుకొండ ఆస్పత్రి వారి సహకారంతో జరిగే ఈ శిబిరంలో అన్ని రకాలు రోగులను ఉచితంగా పరీక్షించి, మందులు అందజేస్తారని, దీర్ఘకాలిక రోగులకు వివిధ రకాలైన శస్త్ర చికిత్సల కోసం మధ్యాహ్నం 2:30 గంటలకు బస్సు ద్వారా అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలిస్తామని అన్నారు. కళ్లు, చెవులు, గుండె, మూలవ్యాధి, పిస్టుల్లా, హైడ్రోసెల్, హెర్నియా, మహిళల సమస్యలు గురించి సంగినవలసలో గల అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేస్తారని అన్నారు.

తెనుగుపూడి జెడ్పీ హైస్కూల్లో సందడిగా ఎస్‌పీఎల్ ఎన్నిక

- పక్కాగా బ్యాలెట్‌ల ద్వారా ఓటింగ్, కౌటింగ్ ప్రక్రియ
- ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యం

దేవరాపల్లి : తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఎస్‌పీఎల్ (స్కూల్ పీపీల్ లీడర్) ఎన్నిక ప్రక్రియను సార్వత్రిక ఎన్నికను తలపించేలా శనివారం నిర్వహించారు. సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై విద్యార్థినీ విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించడంలో భాగంగా శనివారం స్థానిక ప్రధానోపాధ్యాయుడు డి.ఎస్.ఎస్.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్‌పీఎల్ ఎన్నికను నిర్వహించారు. ముందు రోజు ఎలక్షన్ షెడ్యూల్ ప్రకటించడంతో పాటు నామినేషన్ల స్వీకరణ, ప్రచార ప్రక్రియను సైతం చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నిక మాదిరిగా పక్కాగా బ్యాలెట్ బాక్స్‌లను, తెలుపు, పింక్ రంగుల బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేసి రహస్యంగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల అధికారులుగా ఉపాధ్యాయులు వ్యవహరించారు. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద విద్యార్థులు బారులు తీరడంతో పాఠశాల ఆవరణలో సార్వత్రిక, స్థానిక సంస్థలు ఎన్నిక జరుగుతున్న వాతావరణం కనిపించింది. ఎస్‌పీఎల్ విభాగంలో నలుగురు పోటీ పడగా సలాది గాయత్రి 2 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. ఏఎస్‌పీఎల్ విభాగంలో ముగ్గురు పోటీ చేయగా ఆకుల హేమలత 11 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. వారికి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించడంతో పాటు ప్రమాణ స్వీకారం చేయించారు. మొత్తంగా 97 ఓట్లు పోలింగ్ కాగా ఒక ఓటు చెల్లనదిగా హెచ్‌ఎం ప్రకటించారు. అనంతరం హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఎన్నిక ప్రక్రియపై అవగాహన పెంచుకొని, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు త్రినాథ్, శ్రీనివాసరావు, మహేశ్వరరావు, మాధవరావు, కొండమ్మ, పద్మావతి, సోములమ్మ, సుగుణకుమారి, మనోహర్, శ్యామల పాల్గొన్నారు.



తెనుగుపూడి హైస్కూల్‌లో బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేస్తున్న విద్యార్థి



ఓటింగ్ కోసం క్యూలైన్లలో బారులు తీరిన విద్యార్థులు

వేతన బకాయిలు చెల్లించాలి

కె.కోటపాడు : జిల్లాలో గల ఏరియా, సామాజిక ఆసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించే చర్యలను తీసుకోవాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ అన్నారు. కె.కోటపాడు సీహెచ్‌సీ వద్ద పారిశుధ్య సిబ్బందితో కలిసి వేతనాలను మంజూరు చేయాలని శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ శానిటేషన్ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వడంతో పాటు వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. అనంతరం సమస్యలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందించారు. పారిశుధ్య సిబ్బంది శ్రీను, లక్ష్మి, నాగరత్నం, రామారావు, పుష్ప పాల్గొన్నారు.



కె.కోటపాడు ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య సిబ్బందితో లక్ష్మణ

మత్తు పదార్థాల జోలికిపోవద్దు

రావికమతం : విద్యార్థి దశలో మత్తుపదార్థాల జోలికిపోయి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని రావికమతం ఎస్‌ఐ రఘువర్మ సూచించారు. అనకాపల్లి డీఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మరుపాక ఏపీ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుట్కా, సిగరెట్, గంజాయి, అలాగే పాటు మత్తు పానీయాల జోలికి పోవద్దని విద్యార్థులకు హితవు చెప్పారు. చెడు అలవాట్లతో చదువును నిర్లక్ష్యం చేసి భవిష్యత్‌ని నాశనం చేసుకోవద్దన్నారు. ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థుల స్కూలు బ్యాగులను తనిఖీ చేశారు. మోడల్ స్కూల్ పరిసరాల్లో పాన్‌షాప్‌లో గుట్కా పాకెట్ల విక్రయాలపై తనిఖీలు చేశారు. అమ్మాయిలు చదువుకునే స్కూలు, కాలేజీల దగ్గర పనీపాటా లేకుండా తిరిగినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా పోలీసు చర్యలు తప్పవని ఎస్‌ఐ రఘువర్మ హెచ్చరించారు.



మరుపాక మోడల్ స్కూల్ విద్యార్థుల స్కూలు బ్యాగ్‌ల తనిఖీ

నేడు మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో శ్రావణ తొలి ఆదివారం సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు ఆదివారం ఉదయం నిర్వహించనున్నామని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేశామన్నారు.

వరి నారుమడులకు ఊపిరి నిచ్చిన వర్షాలు

మాడుగుల రూరల్ : ఖరీఫ్ వరి నారుకు ఇటీవల కురిసిన వర్షం ఊపిరినిచ్చింది. ఈ నెల మెదటి వారంలో ఎండలు కాయడంతో వరినారు ఎండిపోయింది. ఈ సమయంలో రైతులు ఆందోళన చెందారు. అల్పపీడన ప్రభావంతో ఆడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఎండుతున్న వరి నారుమడులకు ఊపిరినిచ్చింది. కొన్ని చోట్ల నీటి ఆధారం వున్న పంట భూముల్లో ఇప్పటికే వరి నాట్లు వేస్తున్నారు.

అదనపు జిల్లా జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసిన సీఐలు

చోడవరం : బదిలీపై చోడవరం వచ్చిన 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. హరినారాయణను పోలీసు అధికారులు మర్యాదపూర్వంగా శనివారం కలిశారు. పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు అప్పలరాజు, కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.



చోడవరం 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి హరినారాయణను కలిసిన పోలీసు అధికారులు

జ్వరాల నియంత్రణకు చర్యలు

నాతవరం : జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించి జ్వరాలు నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించారు. మండలంలో మాధవనగరం ఎం.బెన్నవరం, ములగపూడి, డి.యర్రవరం, మర్రిపాలెం, వెన్నలపాలెం, నాతవరం, గుమ్మడిగొండ, చమ్మచింత గ్రామాల్లో జ్వర పీడితులు పెరగడంతో గ్రామాల్లో ఇటీవల తరుచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నారు. అనంతరం వైద్యాధికారి ప్రసన్న ఆధ్వర్యంలో రోగులకు మాత్రలు పంపిణీ చేసి సూచనలు అందజేస్తున్నారు. ఇటీవల వర్షాలు అధికంగా కురియడంతో గ్రామాల్లో పారిశుధ్య చర్యలు జోరుగా చేపడుతున్నారు. తాగునీటి పథకాలు, కుళాయిలు, బోర్లలో క్లోరినేషన్ చేపడుతున్నారు.



ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రీ ప్రైమరీలో గట్టి పునాదులు వేయాలి

రావికమతం : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభ బాల్య సంరక్షణ విద్య మెరుగుకు కృషి చేయాలని రావికమతం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి సూచించారు. దొండపూడి, మత్స్యవానిపాలెం గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఆమె ప్రారంభ బాల్య సంరక్షణ విద్యపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆటలు, కథలు పాటలు, బొమ్మల ద్వారా బాల బాలికలకు ప్రాథమిక విద్య బోధించాలని తెలిపారు. 3 నుంచి 6 సంవత్సరాల మధ్య బాలబాలికలకు జ్ఞాపకశక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. బాల బాలికలకు పోషకాహారం అందించే విధంగా తల్లిదండ్రులను చైతన్యవంతులని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొండపూడి గ్రామ వైస్ సర్పంచ్ గట్రెడ్డి రాజారావు, మాజీ వైస్ సర్పంచ్ వెదురుపర్తి ఆచారి, మత్స్యవానిపాలెం సర్పంచ్ గణేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు కొరుబిల్లి దీప, చప్పా లక్ష్మి, ఎస్.లక్ష్మి, పి.లక్ష్మి, ఫణీంద్ర మాస్టర్, మహిళా పోలీసు, ఆశాలు పాల్గొన్నారు.



దొండపూడి అంగన్‌వాడీ కేంద్రంలో సూచనలు చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి


ఐసీడీఎస్ పీవోకు వీడ్కోలు సన్మానం

మాడుగుల : మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిగా పని చేసిన సీహెచ్ శ్రీదేవి బదిలీపై చింతపల్లి వెళ్లారు. దీంతో మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం సాయంకాలం శ్రీదేవికి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే ఇక్కడ సూపరింటెండెంట్ విశ్వనాథం కూడా బదిలీపై అనంతగిరి వెళ్లారు. ఆయనను కూడా సన్మానించారు. కార్యక్రమంలో పీవో శశికళ, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



పీవో శ్రీదేవిని సన్మానిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నీలి నీలి ఆకాశం..



నీలాకాశం నీలిసముద్రాన్ని తలపించింది...నింగి నేలా ఒకటాయెనే..అన్నట్టుగా మబ్బులు ముసురుకుని... శనివారం సాయంత్రం నీలి రంగులో నింగి ఇలా మెరిసిపోయింది.

బుచ్చెయ్యపేట

క్లుప్తంగా

విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ



గొండుపాలెం హైస్కూల్లో విద్యార్థులతో ధ్యానం చేయిస్తున్న గురువులు మీనా, నాగ అప్పారావు

కె.కోటపాడు : విద్యార్థి దశ నుండే ధ్యానంపై ధ్యాసను కనబర్చాలని పిరమిడ్ ధ్యానం గురువులు బి.మీనా, ఓ.నాగ అప్పారావు తెలిపారు. చౌడువాడలో గల ప్రాథమిక పాఠశాలతో పాటు గొండుపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గల విద్యార్థులకు శనివారం ధ్యానంపై శిక్షణను ఇచ్చారు. ధ్యానం ద్వారా శ్వాసపై ఏకగ్రతను చూపడం ద్వారా చదువుల్లో మంచి ప్రతిభతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. ధ్యానం ద్వారా ఒత్తిడి కూడా దూరం అవుతుందని, అందువల్ల ప్రతి రోజు ధ్యానం చేయాలని సూచించారు. గొండుపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవం



ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు రమణ, అశోక్ సామ్రాట్‌తో సభ్యులు

రోలుగుంట : ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయింది. అధ్యక్షుడిగా పి.రమణ, ప్రధాన కార్యదర్శిగా అశోక్ సామ్రాట్, గౌరవ అధ్యక్షుడిగా ఆర్.వి.ఎస్.ఆర్. శర్మ, ఉపాధ్యక్షుడిగా బోనెల రాము, ఆర్.విశాలాక్షి, ఎం.పెంటారావు, ఎస్.వి.ప్రభాకరరావు, కార్యదర్శులుగా ఎ.ఆనందరావు, అప్పాజీ. కె.రామారావు, ఎ.వి.రామ ప్రసాద్, ఎం.ఎస్.వి.మహలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా స్టేట్ కౌన్సిలర్ ఆర్.వి.దొర, ఎన్నికలధికారిగా వారి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పడాల అప్పారావు వ్యవహరించారు.

ఎం.అలమండలో దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్‌ను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ దాడి జగన్

దేవరాపల్లి: ఎం.అలమండ గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ ప్రక్రియను చేపట్టినట్టు సర్పంచ్ దాడి జగన్ తెలిపారు. గ్రామంలో దోమల బెడద అధికంగా ఉండడంతో శనివారం ఫాగింగ్‌ను చేపట్టినట్టు తెలిపారు. ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో సైతం ఫాగింగ్‌ను చేపట్టామన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



బదిలీ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ జయమ్మ తదితరులు

మాడుగుల రూరల్ : మండలంలో సాగరం సచివాలయంలో పనిచేస్తూ బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను శనివారం ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ జయమ్మ తదితరులు సన్మానించారు. బదిలీపై ఈ సచివాలయానికి వచ్చిన వారిని కూడా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనాధు సూర్యకాంతం, జగ్గారావు, ఉప సర్పంచ్ దొడ్డి నారాయణరావు, వార్డు సభ్యుడు పాము నాగరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో తల్లిదండ్రులతో సమావేశం



అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త చంద్ర

మాడుగుల రూరల్ : కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఈసీసీఈ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్ర పిల్లలు నేర్చుకున్న విద్య పీపీ1, పీపీ2, సిలబస్ గురించి సవివరంగా వివరించారు. చిన్నారులతో ఆకారంలో పిక్కలు, రాళ్లు, ఆకులు, పూసలను వరుస క్రమంలో పేర్చి చూపించారు.